సాక్షి
ప్రకాశం
శనివారం ׀ 4 ׀ అక్టోబర్ ׀ 2025



ఎన్‌సీడీసీ రుణాల మంజూరులో భారీ అవినీతి

ఎన్‌సీడీసీ రుణాల మంజూరులో భారీ అవినీతి జరిగిందని, సమగ్ర విచారణ చేపట్టి అక్రమాల నిగ్గు తేల్చాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం డిమాండ్ చేసింది. - 10లో..



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

ఆగి ఉన్న టిప్పర్‌ను బైక్ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన జరుగుమల్లి మండల కేంద్రంలోని పాలకేంద్రం సమీపంలో జరిగింది. - 10లో..

గరిష్ఠం/కనిష్ఠం
33 /26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటీ రెండు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డీపీవో ఉద్యోగులు సమయపాలన పాటించాలి

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



డీపీవో కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయం (డీపీవో) ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ఫైల్స్ పెండింగ్ లేకుండా సకాలంలో పనులు పూర్తిచేయాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, పనులు వాయిదా వేయడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటివి తన దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్బీ, డీటీఆర్బీ, పరిపాలనా విభాగంలోని అన్ని సెక్షన్లు, అడిషనల్ ఎస్పీ కార్యాలయాలను పరిశీలించారు. సంబంధిత అధికారుల నుంచి ఆయా విభాగాలకు సంబంధించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించిన ఎస్పీ.. వాటిని క్రమబద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్ విధుల గురించి ఆరా తీశారు. వారి పనితీరుపై సమీక్షించి సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు పలు సలహాలు, సూచనలు చేశారు. వివిధ కమిషన్ల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి నిర్ణీత కాలంలో సమాధానాలు పంపించాలని చెప్పారు. ఎస్పీ వెంట డీపీవో ఏవో రామ్మోహన్‌రావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్, ఆర్ఐ సీతారామిరెడ్డి ఉన్నారు.

వైఎస్సార్ సీపీ పదవుల్లో పలువురి నియామకం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా నాయకులను పార్టీలోని వివిధ పదవుల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) మెంబర్లుగా మార్కాపురం నియోజకవర్గానికి చెందిన జంకె వెంకటరెడ్డి, కనిగిరి నియోజకవర్గానికి చెందిన చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి, కొండపి నియోజకవర్గానికి చెందిన మాదాసి వెంకయ్యని నియమించారు. అలాగే స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్లుగా మార్కాపురం నియోజకవర్గానికి చెందిన ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఉడుముల కోటిరెడ్డి, వెన్నా హనుమారెడ్డి, కొండపి నియోజకవర్గానికి చెందిన బత్తుల అశోక్ రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని నియమించారు.

ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పరీక్షలు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు (జనరల్, ఒకేషనల్)కు పబ్లిక్ పరీక్షలు 2026 ఫిబ్రవరి 23వ తేదీ నుంచి 2026 మార్చి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ కె.ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు జనరల్ వాళ్లకు 2026 ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు, ఒకేషనల్ వాళ్లకు 2026 జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 2 నుంచి 5 గంటల వరకు రెండు సెక్షన్లలో జరుగుతాయని తెలిపారు. సమగ్రశిక్ష ఒకేషనల్ ట్రేడ్ ఎగ్జామ్ 13-02-2026న జరుగుతుందన్నారు. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ ఎగ్జామ్ జనవరి 21వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ ఎగ్జాం జనవరి 23 ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు జరుగుతుందని తెలిపారు.

ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ షెడ్యూల్...

ఫిబ్రవరి 23న తెలుగు/సంస్కృతం/ఉర్దూ/హిందీ/తమిళ్/ఒరియా/కన్నడ/అరబిక్/ఫ్రెంచ్, 25న ఇంగ్లిష్, 27న హిస్టరీ, మార్చి 2న మ్యాథ్స్, 5న బయాలజీ, 7న ఎకనామిక్స్, 10న ఫిజిక్స్, 12న కామర్స్, 14న సివిక్స్, 17న కెమిస్ట్రీ, 20న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, 24న మోడరన్ లాంగ్వేజ్, జాగ్రఫీ పరీక్షలు జరుగుతాయి.

ఇంటర్ సెకండియర్ పరీక్షల షెడ్యూల్...

ఫిబ్రవరి 24న తెలుగు, 26న ఇంగ్లిష్, 28న బోటనీ/హిస్టరీ, మార్చి 3న మ్యాథ్స్ 2ఏ/సివిక్స్ 2, 6న జువాలజీ-2/ఎకనామిక్స్-2, 9న మ్యాథ్స్ 2బీ, 11న కామర్స్-2/సోషియాలజీ-2/ఫైన్ ఆర్ట్స్/మ్యూజిక్, 13న ఫిజిక్స్-2, 16న మోడరన్ లాంగ్వేజ్/జాగ్రఫీ, 18న కెమిస్ట్రీ-2, 23న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/లాజిక్ పరీక్షలు జరుగుతాయి. సెకండియర్ పరీక్షలు పాత సిలబస్ ప్రకారం జరుగుతాయని, అదేవిధంగా విద్యార్థులకు ఫస్టియర్ సబ్జెక్టులు పెండింగ్ ఉంటే కూడా పాత సిలబస్ ప్రకారమే జరుగుతాయని తెలిపారు.



నగరోత్సవంలో కేశవస్వామిపేట విజయదుర్గాదేవి (మహిషాసురమర్దిని) కళారం

వైభవం.. దసరా ఉత్సవం

జిల్లాలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. విజయ దశమి రోజు ఆలయాల్లో అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఒంగోలు నగరంలోని పలు ఆలయాల ఆధ్వర్యంలో అమ్మవారికి నగరోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. దేవస్థానాలలో పూజలు, అమ్మవార్ల ఉత్సవమూర్తులు, కళారాల ఊరేగింపులు, పార్వేట మహోత్సవాలకు భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజలు చేశారు.

- ఒంగోలు మెట్రో



ఒంగోలు మస్తాన్‌దర్గా సెంటర్‌లో కళారాల ఉత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు

చుక్కల్లో తేలిపోతూ.. నిషేధం ముక్కలు చేస్తూ!

గాంధీ జయంతి రోజు మద్యం, మాంసం విక్రయాలు జరపరాదని ప్రభుత్వ నిబంధనలున్నాయి. డ్రై డే అమలులో ఉన్నప్పటికీ బ్యాక్ డోర్‌లో రెట్టింపు ధరలకు అమ్మకాలు జరిగాయి. మద్యం దుకాణాల వద్ద జోరుగా అమ్మకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. గ్రామాల్లో బెల్టు దుకాణాలకు ముందుగానే భారీగా బాటిళ్లు తరలించి నిల్వ చేసి విక్రయించారు. మాంసం విక్రయాలు సైతం జోరుగా సాగాయి. ఒంగోలు నగరంలో బిర్యానీ అమ్మకాలు జరగడం గమనార్హం. డ్రై డే అమలు చేయాల్సిన ఎక్సైజ్, పోలీసు అధికారులు మామూళ్ల వసూళ్లలో పడి కళ్లుమూసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- గాంధీ జయంతిని లెక్కచేయకుండా మద్యం, మాంసం విక్రయాలు
- పండుగకు ముందే భారీగా మద్యాన్ని నిల్వ చేసుకున్న వ్యాపారులు
- డ్రై డే అమలు చేయకుండా చోద్యం చూసిన ఎక్సైజ్, పోలీసు అధికారులు
- బార్లుగా మారిపోయిన హైవే దాబాలు
- గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- కర్నూలు రోడ్డులో మద్యం సేవించి హల్చల్ చేసిన ఇద్దరు పోలీసులు



గాంధీ జయంతి రోజు ఒంగోలు కొత్త కూరగాయల మార్కెట్‌లో మటన్ అమ్మకాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలో పట్టణాలు, గ్రామాలన్న తారతమ్యం లేకుండా మద్యం విక్రయాలు విపరీతంగా జరుగుతున్నాయి. మందుబాబుల స్వైర విహారం ఎక్కువైపోయింది. గురువారం దసరా పండుగ, జాతిపిత మహాత్మా గాంధీ జయంతి ఒకే రోజు వచ్చాయి. గాంధీ జయంతి రోజు డ్రై డే పాటించాల్సి ఉంది. మద్యం, మాంసం విక్రయాలపై నిషేధం ఉంది. కానీ, ఈసారి గాంధీ జయంతి రోజు మందుబాబులు యథేచ్ఛగా తాగి తందనాలాడారు. చుక్క, ముక్కతో విందువినోదాలు చేసుకున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో చికెన్, మటన్ దుకాణాలు మూసివేసినప్పటికీ బ్యాక్ డోర్ నుంచి జోరుగా విక్రయాలు కొనసాగించారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో మఫ్టీలో ఉన్న ఇద్దరు పోలీసులు తప్పతాగిన మైకంలో జనాన్ని దూషించడం వివాదంగా మారింది.

గ్రామాలకు ముందుగానే మద్యం తరలింపు...

జిల్లాలో అధికారికంగా 189 మద్యం దుకాణాలున్నాయి. ఇవన్నీ అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వం లైసెన్సు మంజూరు చేసిన దుకాణాలకు అదనంగా ఒక్కో దుకాణానికి అనుబంధంగా పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు పుట్టుకొచ్చాయి. జిల్లాలోని 729 పంచాయతీల్లో 1823 గ్రామాలుండగా ప్రతి గ్రామంలోనూ బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా రోజుకు రూ.3 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. దసరా పండుగ, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో మద్యం వ్యాపారులు, బెల్ట్ షాపు నిర్వాహకులు రెండు మూడు రోజులు ముందుగానే భారీగా మద్యం తరలించి నిల్వ చేసినట్లు సమాచారం. దీంతో వారం రోజుల్లో 30 నుంచి 50 శాతం అదనంగా మద్యం ఆర్డర్లు వచ్చినట్లు ఎక్సైజ్ ఉద్యోగులు చెబుతున్నారు. పండుగ రోజు డ్రై డే ఉన్నప్పటికీ గ్రామాల్లో బహిరంగంగానే మద్యం విక్రయాలు జరిపినట్లు సమాచారం. పట్టణాలలో బ్యాక్ డోర్ నుంచి మద్యం విక్రయాలు నిర్వహించారు. ఎక్సైజ్ అధికారులు, బెల్ట్ షాపుల నిర్వాహకులు కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు ఒంగోలులోని కర్నూలు రోడ్డులో తాగిన మైకంలో హల్చల్ చేయడం వివాదాస్పదమైంది. గాంధీ జయంతి రోజు ఏకంగా పోలీసు కానిస్టేబుళ్లే తాగి తిరుగుతుంటే ఇక పరిస్థితి ఎలా ఉందో అర్థంచేసుకోవచ్చని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎక్సైజ్ శాఖ తీరుపై విమర్శలు...

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో ఉద్యోగుల మధ్య ఆధిపత్య పోరు జరుగుతున్నట్లు సమాచారం. కొత్తగా ఈఎస్‌గా బాధ్యతలు చేపట్టిన అధికారి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు ఆ శాఖ ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు. కొత్త ఈఎస్ వచ్చిన తర్వాత జిల్లాలో తనిఖీలు మూలనపడినట్లు తెలుస్తోంది. అంతకుముందు ప్రతిరోజూ ఉదయం 10 గంటల్లోపు ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలను తనిఖీలు చేయడానికి గస్తీ తిరిగేవారని, ఇప్పుడు ఎలాంటి తనిఖీలు లేవని చెప్పుకుంటున్నారు. జిల్లాలో గుడి, బడి అనే తేడా లేకుండా మద్యం విక్రయాలు నిర్వహిస్తుంటే పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులను సమన్వయం చేసుకోవడం ద్వారా జిల్లాలో బెల్ట్ షాపులను కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బార్లను మించిపోయిన దాబాలు...

ఒంగోలు హైవేల పక్కన ఉన్న దాబాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. పోలీస్, ఎక్సైజ్ అధికారులను మేనేజ్ చేస్తున్న నిర్వాహకులు.. ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. దసరా పండుగ సందర్భంగా దాబా హోటళ్లు మందుబాబులకు అడ్డాగా మారాయి. సిట్టింగ్ సౌకర్యం ఉండడంతో ఇవి బార్లను తలపించే విధంగా మారినట్టు సమాచారం. మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్, పోలీసు అధికారులు దాబా హోటళ్ల వైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బహిరంగంగానే మాంసం అమ్మకాలు...

గాంధీ జయంతి రోజు జిల్లాలో బహిరంగంగానే మాంసం అమ్మకాలు జరగాయి. నగరంలోని 60 అడుగుల రోడ్డు, నెల్లూరు బస్టాండు సెంటర్, అద్దంకి బస్టాండ్ సెంటర్, కర్నూలు రోడ్డు, గుంటూరు రోడ్లలో బిర్యానీ సెంటర్లను వ్యాపారాలు నిర్వహించుకోవడం కనిపించింది. ఇక, చికెన్ పకోడా సెంటర్లయితే లెక్కేలేదు. చికెన్ దుకాణాలు మూసివేసినప్పటికీ బిర్యానీ హోటళ్లకు చికెన్ ఎక్కడి నుంచి వచ్చిందన్న ప్రశ్నకు జవాబు ఇచ్చేనాథుడే లేడు. ఒంగోలు నగరం పాతమార్కెట్ సెంటర్, ఊరచెరువు రోడ్డు, కొత్త కూరగాయల మార్కెట్‌లో చికెన్, మటన్ అమ్మకాలు జోరుగా సాగాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



గాంధీ జయంతి రోజు ఒంగోలు పాత కూరగాయల మార్కెట్ సెంటర్లో తెరిచి ఉన్న చికెన్ దుకాణాలు

గాంధీజీ మార్గం అనుసరణీయం

- ఘనంగా జయంతి వేడుకలు

ఒంగోలు సబర్బన్: జాతిపిత మహాత్మాగాంధీ వ్యక్తిత్వం, ఆయన చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని కలెక్టర్ పీ రాజాబాబు అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకుని ఒంగోలు గాంధీరోడ్డులోని గ్రామచావిడి వద్ద ఉన్న అయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల జయంతులు నిర్వహించుకోవడం మనందరి అదృష్టమన్నారు. వారు చూపిన మార్గంలో పయనిస్తూ వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. 40 లక్షల రూపాయల వ్యయంతో గ్రామచావిడిని పునర్నిర్మిస్తున్నామని, ఇది అందరికీ ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 10 మంది పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దనరావు, బీఎన్ విజయ కుమార్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య, మేయర్ గంగాడ సుజాత పాల్గొని గ్రామ చావిడి పునర్నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, నాయకులు

గాంధీజీకి వైఎస్సార్ సీపీ నాయకుల నివాళులు...

ఒంగోలు సిటీ: స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శులు వై.వెంకటేశ్వరరావు, బొట్ల రామారావు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు పాల్గొని మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి భూమిరెడ్డి రవణమ్మ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరకంటి శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు, రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి గౌతమ్ అశోక్, రాష్ట్ర ఇంటలెక్చువల్ కమిటీ ప్రధాన కార్యదర్శి రొండా అంజిరెడ్డి, నాయకులు సయ్యద్ అఫ్సర్, షేక్ మీరావలి, వీసం బాలకృష్ణ, పిగిలి శ్రీనివాసరావు, షేక్ జిలానీబాషా, ఫణిదపు సుధాకర్, డివిజన్ అధ్యక్షులు రాజేష్, భాస్కర్, గళ్లా దుర్గా, పార్టీ నాయకులు వేముల శ్రీకాంత్, వెంకయ్య నాయుడు, పెట్లూరి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల రేషన్ దందా

- నాగులుప్పలపాడులో బియ్యం లారీ పట్టివేతతో వెలుగులోకి..
- బాపట్ల జిల్లాకు చెందిన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేల సహకారంతో రెచ్చిపోతున్న బియ్యం మాఫియా
- జనసేన నాయకుడు వక్కలగడ్డ సుధీర్, టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి యథేచ్ఛగా బియ్యం వ్యాపారం
- ఒంగోలుకు చెందిన టీడీపీ కార్పొరేటర్‌తో పాటు మరో టీడీపీ మహిళా కార్పొరేటర్ భర్త పేరును తప్పించిన వైనం
- ఒంగోలు, బాపట్ల జిల్లాలకు చెందిన టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్లు గుసగుసలు
- బియ్యం సమాచారమిచ్చింది టీడీపీ స్థానిక నాయకులేనని ప్రచారం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: నాగులుప్పలపాడు మండలంలో పోలీసులకు పట్టుబడిన రేషన్ బియ్యం లారీ విషయంతో కూటమి నాయకుల చీకటి దందా వెలుగులోకి వచ్చింది. బాపట్ల నుంచి వయా నాగులుప్పలపాడు మీదుగా కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని నాగులుప్పలపాడు పోలీసులు పట్టుకుని సీజ్ చేయడం సంచలనం సృష్టించింది. బాపట్లలో రేషన్ బియ్యంతో లారీ బయలుదేరినట్లు నాగులుప్పలపాడు ఎస్ఐ షేక్ రజియా సుల్తానాకు శుక్రవారం ఫోన్ వచ్చింది. వెంటనే ఆమె రంగంలోకి దిగారు. ఉప్పుగుండూరు వద్ద పోలీసులను చూసిన లారీ వేగం పెంచి తప్పించుకునే ప్రయత్నం చేయడంతో సినిమా తరహాలో చేజ్ చేసిన ఎస్సై రజియా సుల్తానా బృందం నాగులుప్పలపాడు నుంచి ఇంకొల్లు వెళ్లే దారిలో లారీని అడ్డుకున్నారు. అందులో రేషన్ బియ్యం ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు. 50 కిలోల బస్తాలు 720 ఉన్నట్లు లెక్కతేల్చారు. ఇక్కడే కథ కీలక మలుపు తిరిగింది.

ఎస్సైకు సమాచారం ఇచ్చిందెవరు?

రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతోందని నాగులుప్పలపాడు ఎస్సైకి సమాచారం ఎవరిచ్చారు.. ఎందుకు ఇచ్చారన్న దానిపై జిల్లాలో చర్చ జరుగుతోంది. మండల టీడీపీలోని రెండు గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు జరుగుతోంది. ఒక గ్రూపునకు చెందిన టీడీపీ నాయకులు ఎస్సైకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. నాగులుప్పలపాడు మండలంలో టీడీపీకి చెందిన ఒక రేషన్ వ్యాపారి ఈ బియ్యాన్ని కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నట్లు టీడీపీ స్థానిక నాయకులకు సమాచారం వచ్చినట్లు తెలిసింది. దీంతో వారు ఎస్సైకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అయితే, బియ్యం పట్టుబడిన తర్వాత అసలు విషయం బయటపడింది. దాంతో పోలీసులతో సహా టీడీపీ స్థానిక నాయకుల పరిస్థితి కుడితిలో పడిన ఎలుక చందంగా తయారైందని సమాచారం.

కూటమి నాయకుల చీకటి వ్యాపారం...

నాగులుప్పలపాడులో పోలీసుల దాడిలో దొరికిన రేషన్ బియ్యం వెనుక ఉంది బాపట్ల, ఒంగోలుకు చెందిన టీడీపీ నాయకులేనని సమాచారం. బాపట్లకు చెందిన జనసేన నాయకుడు వక్కలగడ్డ సుధీర్, బాపట్లకే చెందిన టీడీపీ నాయకుడు వణుకూరి సుధాకర్‌రెడ్డితో పాటు ఒంగోలు నగరపాలక సంస్థకు చెందిన ఒక టీడీపీ కార్పొరేటర్, మరో టీడీపీ కార్పొరేటర్ భర్త, మరికొందరు టీడీపీ, జనసేన నాయకులు రేషన్ బియ్యాన్ని కృష్ణపట్నం తరలిస్తున్నట్లు తెలిసింది. నాగులుప్పలపాడు పోలీసులు మాత్రం బాపట్ల జనసేన నాయకుడు సుధీర్, టీడీపీ నాయకుడు సుధాకర్ రెడ్డి, లారీ డ్రైవర్ నాగరాజులపై మాత్రమే కేసు నమోదు చేశారు. ఒంగోలుకు చెందిన టీడీపీ కార్పొరేటర్, మహిళా కార్పొరేటర్ భర్త పేరును కేసు నుంచి తప్పించినట్లు ప్రచారం జరుగుతోంది. నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి హత్య కేసుతో సంబంధం ఉన్నట్లు అనుమానించి పోలీసులు విచారించిన పలువురు టీడీపీ నాయకులకు కూడా ఇందులో ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. బాపట్ల జిల్లాకు చెందిన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేల సహకారంతో మద్దిపాడు మండలంలో ఒక రైస్ మిల్లు అద్దెకు తీసుకున్న సుధీర్, సుధాకర్‌రెడ్డి ముఠా రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం.

3 రాష్ట్ర స్థాయి, 49 జిల్లా స్థాయి అవార్డులు

ఒంగోలు సబర్బన్: స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాకు లభించిన స్వచ్ఛాంధ్ర అవార్డులను కలెక్టర్ పి.రాజాబాబు ప్రకటించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లాకు వచ్చిన స్వచ్ఛాంధ్ర అవార్డుల వివరాలను కలెక్టర్ వెల్లడించారు. జిల్లాకు 3 రాష్ట్ర స్థాయి అవార్డులు, 49 జిల్లా స్థాయి అవార్డులు వచ్చినట్లు తెలిపారు. స్వచ్ఛ నగర, మండలాలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ ఆస్పత్రులు, స్వచ్ఛ కార్యాలయాలు, స్వచ్ఛ రైతు బజార్లు, స్వచ్ఛ బస్ స్టేషన్లు, స్వచ్ఛ పరిశ్రమలు మొదలైన 17 విభాగాలలో అవార్డులకు ఎంపిక చేసినట్లు చెప్పారు. స్వయం మూల్యాంకనం, జిల్లా అధికారుల పరిశీలన, తృతీయ పక్ష మూల్యాంకనం ఆధారంగా మూడు దశల్లో స్వచ్ఛాంధ్ర అవార్డులు – 2025కు రేటింగ్/ర్యాంకింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెల 6వ తేదీ విజయవాడలో రాష్ట్ర స్థాయి అవార్డుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో ఈ అవార్డులు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు.

త్రైలోక్య మాతా.. ధనయోస్మి



మార్కాపురం : జమ్మనపల్లిలో కరెన్సీ నోట్ల అలంకారంలో ముద్దసానమ్మ అమ్మవారు

యర్రగొండపాలెం/మార్కాపురం టౌన్: విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం యర్రగొండపాలెంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు విజయ ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.27 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో నిర్వాహకులు అలంకరించగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శమిపూజ అనంతరం మహిషాసురమర్దినిగా అమ్మవారిని అలంకరించి రథోత్సవం నిర్వహించారు. అలాగే మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి వద్ద ముద్దసానమ్మ ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని రూ.24,11,116 విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించి పూజలు చేశారు.



యర్రగొండపాలెంలో కరెన్సీ నోట్ల అలంకరణలో వాసవీమాత

ముత్తూట్ ఫైనాన్స్‌లో చోరీకి విఫలయత్నం

మద్దిపాడు: మండల కేంద్రమైన మద్దిపాడులో ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ కార్యాలయంలో దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. స్థానికంగా కలకలం రేపిన ఈ సంఘటన శుక్రవారం ఉదయం వెలుగుచూసింది. అందిన వివరాల ప్రకారం.. గురువారం దసరా పండగ సందర్భంగా సెలవు కావడంతో మద్దిపాడు ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ కార్యాలయం మూతవేశారు. శుక్రవారం ఉదయం విధులకు హాజరైన సిబ్బంది.. కార్యాలయ పైభాగంలో అద్దాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. సంస్థ పైఅధికారులకు తెలియజేయడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సాయంత్రం 4.30 గంటల సమయంలో డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

గస్తీ సరిలేకనే?

ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయంలో ఆభరణాలు, నగదు చోరీ కాలేదని సమాచారం. మద్దిపాడు పోలీస్ స్టేషన్లో సిబ్బంది కొరత కారణంగా గస్తీ సక్రమంగా లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి వెంట రాత్రి వేళ నిరంతర గస్తీని ముమ్మరం చేసేందుకు పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భూముల రీసర్వే పేరుతో రైతులకు తిప్పలు



సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

మార్కాపురం: మండలంలోని పెద్దనాగులవరం గ్రామంలో శుక్రవారం భూముల రీసర్వే ఉందని రెవెన్యూ అధికారులు దండోరా వేయించారు. దీంతో పలువురు రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకుని గ్రామ సచివాలయం వద్దకు చేరుకున్నారు. అయితే అక్కడ రెవెన్యూ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రీసర్వే చేస్తున్నట్లు చెబితేనే తాము వచ్చామని, ఎవరూ పట్టించుకోలేదని రైతులు సీనయ్య, వెంకట లక్ష్మమ్మ, వెంకట స్వామి, నడిపి అల్లూరయ్య, ఓర్సు అడివయ్య, రేపని వెంకటేశ్వర్లు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను రీసర్వే పేరుతో ఇబ్బంది పెట్టవద్దని సీపీఎం నాయకులు గుమ్మా బాల నాగయ్య అధికారులను కోరారు. పొలాల్లో పనులు పోగొట్టుకుని రీసర్వే కోసం సచివాలయం వద్ద వేచి ఉన్నప్పటికీ రైతుల అప్లికేషన్లు తీసుకునేవారు లేకపోవడం శోచనీయమన్నారు.

క్లుప్తంగా

ఎయిడెడ్ స్కూళ్లకు సీఆర్పీలను కేటాయించాలి

- ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా నేతల డిమాండ్

ఒంగోలు సిటీ: జిల్లా పరిధిలోని 39 ఎయిడెడ్ ఏకోపాధ్యాయ పాఠశాలలకు సీఆర్పీలను కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పెళ్లూరు, కొప్పోలు, ఒంగోలు, కొత్తపల్లి, బసవన్న పాలెం, మద్దిరాలపాడు, పోతవరం, అమ్మనబ్రోలు, తిమ్మసముద్రం, ఉప్పుగుండూరు, చెరుకూరు, ఇడుపులపాడు, మార్టూరు, రాజుపాలెం, అద్దంకి, చీమకుర్తి, రాజుపాలెం, రావిపాడు, కంభం,తిరుమలాపురం, గిద్దలూరు, బెస్తవారిపేట, కనిగిరి, గుడిపాటి పల్లి, కరేడు ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క టీచరే 1 నుంచి 5వ తరగతి, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10 వ తరగతి వరకు బోధిస్తున్నారని వివరించారు. టీచర్లు సెలవు పెట్టినప్పుడు సీఆర్పీలను పంపాల్సి ఉండగా కొందరు విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వాలంటరీ టీచర్‌ను నియమించుకుని సెలవు పెట్టుకోవాలని ఎంఈఓలు సూచించడాన్ని తప్పుబట్టారు. జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి ఏకోపాధ్యాయ పాఠశాలలకు శాశ్వత సీఆర్పీలను కేటాయించాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపు ఫలాలు ప్రజలకు అందాలి

- ఇరవై సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ దినకర్



జీఎస్టీపై అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న దినకర్

ఒంగోలు సబర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణల ఫలాలు ప్రజలకు అందాలని ఇరవై సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. వినియోగదారులకు కలిగే మేలుపై అవగాహన కల్పించడానికి వాణిజ్య పన్నుల శాఖ అధికారులు శుక్రవారం ఒంగోలులోని కలెక్టరేట్‌లో నిర్వహించిన సదస్సుకు దినకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ సంస్కరణలను సక్రమంగా అమలు చేసి ప్రజలకు నాణ్యమైన వస్తువులు, సేవలు న్యాయమైన ధరకు అందేలా పర్యవేక్షించాలని వినియోగదారుల కమిషన్ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ సత్య ప్రకాశ్, డీఆర్‌ఓ ఓబులేసు, ఒంగోలు చార్టర్డ్ అకౌంటెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరువాయి కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేవతు శ్రీరాములు, ఎస్టీపీ అసోసియేషన్ అధ్యక్షుడు రోశయ్య పాల్గొన్నారు.

పండగ పూటా పచ్చ కుట్రలు



విద్యుత్ దీపాల వెలుగులో కోలాటం స్టేజీ



పోలీస్ ఆంక్షలతో లైట్లు ఆపేశాక కోలాట ప్రదర్శన

- కొండపి మండలం పెద్దకండ్లకుంటలో టీడీపీ నేతల దుశ్చర్య
- కోలాట ప్రదర్శనకు అనుమతివ్వకుండా పోలీసులపై ఒత్తిడి
- హైకోర్టు అనుమతితో కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణుల ఏర్పాట్లు
- అయినా పోలీసులను పురమాయించి అడుగడుగునా ఆంక్షలు
- ప్రభ డెకరేషన్ లైట్లు ఆపి, రాత్రి 11 గంటలకే ప్రదర్శన నిలిపివేత
- టీడీపీ ప్రభపై తెల్లవారుజామున 3 గంటల వరకు రికార్డు డ్యాన్స్

కొండపి: కొండపి నియోజకవర్గంలో టీడీపీ నేతల ఆగడాలు రోజురోజుకూ శృతిమించుతున్నాయి. పండగ పూటా పచ్చ నేతలు కుట్రలు చేసిన తీరు చూసి జనం ఛీకొట్టారు. వివరాల్లోకి వెళ్తే.. మహర్నవమి సందర్భంగా బుధవారం రాత్రి కొండపి మండలం పెద్ద కండ్లగుంట గ్రామంలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రభపై కోలాట ప్రదర్శనకు, టీడీపీ నేతల ఆధ్వర్యంలో ప్రభపై పాటకచేరీకి ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు పోలీసుల అనుమతికి దరఖాస్తు చేసుకోగా నిరాకరించడంతో ఆ పార్టీ నేతలు ఏకంగా హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు కోలాట ప్రదర్శనకు పోలీసులు అనుమతించక తప్పలేదు. తొలుత అనుమతి నిరాకరించేలా పోలీసులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేసిన టీడీపీ నాయకులు తమ కుట్రలకు మరింత పదునుపెట్టారు. కోలాట ప్రదర్శనను సవ్యంగా సాగకుండా పోలీసులను ఉసిగొల్పి అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు.

లైట్లు ఆపేసి.. ప్రదర్శన త్వరగా నిలిపేసి..

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై బెలూన్లు తొలగింపజేసిన పోలీసులు.. డెకరేషన్ లైట్లను సైతం ఆపివేయించారు. మైకుల సంఖ్యను కూడా కుదించి కోలాట ప్రదర్శనను నిర్వహించుకోవాలని సూచించారు. అయినప్పటికీ సంయమనం పాటించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు.. టీడీపీ నేతల డైరెక్షన్‌లో పోలీసులు ఇచ్చిన ఆదేశాలను పాటించారు. అమ్మవారి మొక్కు తీర్చుకునేందుకు వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్ల వెలుగులోనే కోలాట ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ప్రభపై అశ్లీలతకు పేరొందిన రికార్డ్ డ్యాన్స్‌కు అడగగానే అనుమతిచ్చేసిన పోలీసులు.. సాంస్కృతిక కార్యక్రమమైన కోలాట ప్రదర్శనకు అనుమతి నిరాకరించడం, లైట్లు ఆపేయడం, బెలూన్లు సైతం తొలగించడం చూసి చుట్టుపక్కల గ్రామాల భక్తులతోపాటు గ్రామస్తులు విస్తుపోయారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన కోలాటాన్ని రెండు గంటల వ్యవధిలోనే అంటే 11 గంటలకే నిలిపేసిన పోలీసులు.. టీడీపీ ప్రభపై రికార్డ్ డ్యాన్స్‌ను మాత్రం తెల్లవారుజామున 3 గంటల వరకు దగ్గరుండి జరిపించడం గమనార్హం.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

పెద్దకండ్లగుంటలో కోలాట ప్రదర్శన ఆహూతులను అలరించింది. సుమారు 46 మంది కళాకారులు రెండు నెలలపాటు సాధన చేసి కోలాటం ప్రదర్శించారు. కోలాటాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు. రెండు గంటలపాటు సాగిన ప్రదర్శనను ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా 2 వేల మందికి అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, వైస్ ఎంపీపీ వేముల ప్రసాద్, మండల సీనియర్ నాయకులు వేముల రమేష్, ఎంపీటీసీ సుబ్బారావు, లక్ష్మీనరసయ్య, కార్తీక్ సుల్తాన్, రవీంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఓబుల్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్లు, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనవసర రాద్ధాంతం చేశారు

కోలాట ప్రదర్శనకు అనుమతి అడిగితే పోలీసులు కాదనడంతో హైకోర్టును ఆశ్రయించాం. కోర్టు అనుమతి ఇవ్వడంతో ఆ మేరకు ఏర్పాట్లు చేసుకున్నాం. కానీ టీడీపీ నేతల ఒత్తిడితో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన నిర్వహించకూడదన్నది వారి ఉద్దేశం. అందుకు పోలీసులను అడ్డుపెట్టుకుని ఇబ్బందులు పెట్టారు. అయినా మేమంతా సంయమనం పాటించాం. పోలీసుల సూచన మేరకు లైట్లు ఆపేసి ఉన్న కాస్త వెలుగులోనే ప్రదర్శన కొనసాగించాం. ఏడు గంటలకు ప్రారంభం కావాల్సిన కోలాట ప్రదర్శన పోలీసుల ఆంక్షల వల్ల 9 గంటలకు మొదలైంది. టీడీపీ ప్రభ వద్ద జనం లేరన్న కారణంతో 11 గంటలకే మా ప్రోగ్రామ్‌ను ఆపేశారు. పండగ పూట రాజకీయాలు చేయడం, అందుకు పోలీసులు సహకరించడం ఎంత వరకు సబబో ఆలోచించుకోవాలి.

– భువనగిరి సత్యనారాయణ, పెద్దకండ్లగుంట సర్పంచ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

- ఆగి ఉన్న టిప్పర్‌ను బైక్ ఢీకొట్టడంతో దుర్ఘటన



యువకుల మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్సై మహేంద్ర

జరుగుమల్లి(సింగరాయకొండ): దసరా పండగ పూట రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న టిప్పర్‌ను ప్రమాదవశాత్తు మోటారుసైకిల్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఈ ఘటన బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మండల కేంద్రమైన జరుగుమల్లిలో పాల కేంద్రం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన కట్టా ప్రవీణ్(21), చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన శ్రీరాములు రాజు(20) ఇద్దరూ కలిసి చింతలపాలెం నుంచి టంగుటూరుకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉంచిన టిప్పర్ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

ఎన్‌సీడీసీ రుణాల మంజూరులో భారీ అవినీతి

- సమగ్ర విచారణ చేపట్టి అక్రమాల నిగ్గు తేల్చాలి
- పశుసంవర్ధక శాఖ జేడీకి ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఫిర్యాదు



పశుసంవర్ధక శాఖ జేడీకి వినతి పత్రం ఇస్తున్న ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ నాయకులు

ఒంగోలు సబర్బన్: నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌సీడీసీ) రుణాల మంజూరులో అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ.. గొర్రెలు, మేకల పెంపకందారుల జిల్లా సహకార యూనియన్ ద్వారా ఇచ్చిన ఎన్‌సీడీసీ రుణాల్లో అవినీతిని నిగ్గు తేల్చి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా యూనియన్ ద్వారా 2014 నుంచి 2021 వరకు గొర్రెల పెంపకందారుల అభివృద్ధి కోసం మూడు దఫాలుగా రూ.20 కోట్ల రుణాలు సుమారు 1000 మందికి ఇచ్చారన్నారు. అయితే అప్పటి పాలకవర్గం, అధికారులు కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా రుణాలు పంపిణీ చేశారని ఆరోపించారు. ఆడిట్ అధికారులు కూడా డాక్యుమెంట్ వెరిఫికేషన్ చేసి రుణాల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు నివేదిక ఇచ్చారన్నారు. దీనినిబట్టి రుణాల మంజూరు సమయంలో దరఖాస్తుదారుల డాక్యుమెంట్ల పరిశీలన కూడా సరిగా చేయలేదని అర్థమవుతోందన్నారు. ప్రధానంగా ఒకే మార్ట్‌గేజిపై ఇద్దరికి, ముగ్గురికి ఒకరి డాక్యుమెంట్ల జిరాక్సులే పెట్టి రుణాలు ఇవ్వడం, సొసైటీలో లేని సభ్యులకు రుణాలు ఇవ్వడం, అలాగే ఒకే సొసైటీలో 10 నుంచి 20 మందికి రుణాలు ఇవ్వడం, బినామీ పేర్లతో రుణాలు పొందేందుకు సహకరించడం లాంటి అక్రమాలకు యథేచ్ఛగా పాల్పడ్డారని, అందుకు అప్పటి అధికారులు సహకరించడం దారుణమన్నారు. ఈ క్రమంలో అర్హులు ఉన్నప్పటికీ కొన్ని సొసైటీల్లో ఒక్కరికీ కూడా ఎన్‌సీడీసీ రుణం మంజూరు చేయలేదని చెప్పారు. రుణాల మంజూరులో నిబంధనలు తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు నగదు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. సుమారు రూ.5 కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకటరావు, జిల్లా కార్యదర్శి తోట తిరుపతరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ఆంజనేయులు, చిట్టిబోయిన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'ప్రకాశం' పేరును నిలబెడదాం

- ఆయుధ పూజలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు



ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు దంపతులు

ఒంగోలు టౌన్: ప్రశాంత వాతావరణానికి నిలయమైన ప్రకాశం జిల్లా పేరును నిలబెట్టేందుకు సమష్టిగా కృషి చేద్దామని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పిలుపునిచ్చారు. విజయ దశమి పండగను పురస్కరించుకొని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో శాస్త్రోక్తంగా ఆయుధపూజ నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో సతీసమేతంగా ఎస్పీ పూజలు చేశారు. నిత్యం పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు వ్యవస్థలో శాంతి భద్రతలను కాపాడటంలో ఆయుధాలకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు , సిబ్బంది పునరంకితం కావాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, ఎఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, తాలుకా సీఐ విజయకృష్ణ, మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుధాకర్, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్, సీసీఎస్ సీఐ జగదీష్, ఆర్‌ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఎస్సైలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

గ్రానైట్ అక్రమ తవ్వకాలు ఆపాలి

- కారుమంచి కాలువను పునర్నిర్మించి రైతులకు మేలు చేయాలి
- జిల్లా దిశ కమిటీ సమావేశంలో కలెక్టర్, దిశా కమిటీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు



గ్రానైట్ అక్రమ తవ్వకాలపై కలెక్టర్ రాజాబాబుకు ఫిర్యాదు చేస్తున్న చీమకుర్తి జెడ్పీటీసీ వేమా

ఒంగోలు సబర్బన్: చీమకుర్తిలో గ్రానైట్ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని, లేకుంటే అనేక గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారని వైఎస్సార్ సీపీ చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు కలెక్టర్ పీ రాజాబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఒంగోలు ఎంపీ, జిల్లా దిశ కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం దిశ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 18 గ్రామాలకు తాగునీరు, 20 వేల ఎకరాలకు సాగునీరు అందించే కారుమంచి కాలువ దాని పక్కనున్న క్వారీలో పడిపోయి రైతులు, రైతు కూలీల జీవనోపాధికి ఆటంకం కలుగుతోందని తెలిపారు. కారుమంచి కాలువను ఆనుకుని ఉన్న మధుకాన్ గ్రానైట్ క్వారీ వారు పరిధిని మించి తవ్వకాలు చేపట్టారని, ఇరిగేషన్ పరిధిలో ఉన్న ఎస్ఎస్‌పీ కాలువను కూడా అక్రమంగా తవ్వారని తెలిపారు. ఫలితంగా చీమకుర్తి పట్టణ దక్షిణపు గ్రామాల రైతులు, రైతు కూలీలు సాగునీరు అందకపోవడంతో పాటు తాగునీరు కూడా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. చివరకు ఒంగోలు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేయాల్సి వచ్చిందని కూడా గుర్తు చేశారు. డీఎంఎఫ్ గ్రాంట్ నుంచి 2.62 కోట్ల రూపాయలు మంజూరైనప్పటికీ టెండర్ పిలవకపోవడంలో ఆంతర్యం ఏమిటని వేమా ప్రశ్నించారు. లైనింగ్ మార్చి ఉన్న ప్రాంతానికి దూరంగా లైనింగ్ వేయాలనే ఉద్దేశంతో అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రైతుల ద్వారా తమ దృష్టికి వచ్చిందన్నారు. రెండో విధానంలో పైపులైను ద్వారా కారుమంచి కాలువను పునరుద్ధరించాలనే ఆలోచన కూడా చేస్తున్నారని, ఇది రైతులకు ప్రయోజనకరం కాదని అన్నారు. రైతులకు నష్టం వాటిల్లే నిర్ణయం తీసుకుంటే రాజకీయ పార్టీలకు అతీతంగా ఉమ్మడి కార్యాచరణతో క్షేత్రస్థాయి నుంచి ఉద్యమం చేయాల్సి ఉంటుందన్నారు. స్పందించిన కలెక్టర్.. తక్షణమే ఈ విషయంపై విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు. దిశ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివరాలపై కమిటీ ఛైర్మన్ మాగుంట సమీక్షించారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు



రైల్వే స్టేషన్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: గంజాయి, ఇతరా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి చేసే నేపథ్యంలో జిల్లా పోలీసులు శుక్రవారం రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ డిపోల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒంగోలు ఆర్టీసీ డిపోలోని పార్శిల్ కార్యాలయంలో అనుమానాస్పద బుకింగ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను పసిగట్టడంలో ప్రత్యేక శిక్షణ పొందిన స్నిపర్ డాగ్ రాకీతో కలిసి బస్సులు, రైళ్లలోని ప్రయాణికుల లగేజీ బ్యాగులను పరిశీలించారు. తనిఖీలకు నేతృత్వం వహించిన వన్‌టౌన్ సీఐ నాగరాజు మాట్లాడుతూ.. గంజాయి రవాణాను కట్టడి చేయడానికి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. మాదక ద్రవ్యాల రవాణా విషయంలో నిరంతర నిఘా పెట్టినట్లు తెలిపారు. అక్రమ రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిషేధిత వస్తువులకు సంబంధించిన సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, పోలీసు వాట్సప్ నంబర్ 91211 02266కు తెలియజేయాలని కోరారు.